

అనంతవరం గ్రామ పంచాయతీ వ్యూ

# ఇప్పట్లో లేనట్లే!

| జిల్లా | పంచాయతీలు |
|---|---|
| నాగర్‌కర్నూల్ | 461 |
| మహబూబ్‌నగర్ | 441 |
| నారాయణపేట | 280 |
| వనపర్తి | 255 |
| జోగుళాంబ గద్వాల | 255 |

ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలు

- సర్పంచ్ ఎన్నికలు మరింత ఆలస్యం
- బీసీ కులగణన తేలితేనే ముందుకు..
- ఫిబ్రవరి ఒకటితో ముగిసిన సర్పంచుల పాలన
- నిధుల్లేక నీరసిస్తున్న పంచాయతీలు
- మొక్కుబడిగా ప్రత్యేకాధికారుల విధులు
- కొరవడిన జవాబుదారీతనం
- రాష్ట్రంలో సరే.. గ్రామాల్లో ప్రజాపాలన ఇంకెప్పుడు?

నాగర్‌కర్నూల్, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ప్రజాపాలన తీసుకొచ్చామంటున్న సీఎం రేవంత్ ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీల్లో ప్రజాపాలనను తీసుకురావడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. బీసీ కులగణన ప్రక్రియ నేపథ్యంలో కనీసం రెండు, మూడు నెలలు జాప్యం కావొచ్చని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనతో ఆశావహులతో పాటు ప్రజల్లోనూ ఆందోళన నెలకొన్నది. ఫిబ్రవరి 1న సర్పంచుల పదవీకాలం ముగియడంతో నాటి నుంచి గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ప్రత్యేకాధికారుల మొక్కుబడి విధులతో ప్రజలకు జవాబుదారీతనం పూర్తిగా కరువైంది. ఫలితంగా నిధుల విడుదల లేకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి, సమస్యల పరిష్కారం గాలిలో దీపంలా మారింది. గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణ మరింత జాప్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ సంవత్సరం ఫిబ్రవరి 1తో గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీకాలం ముగిసింది. దీంతో సర్పంచ్ పదవులకు ఎన్నికలు ఇదిగో, అదిగో అంటూ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నది. ఇప్పటికే పంచాయతీ శాఖ అధికారులు ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లను చేపట్టారు. అయితే పార్లమెంట్ ఎన్నికల కోడ్ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అడ్డుగా మారింది. ఇంతకు ముందు జూన్‌లో ఖచ్చితంగా ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్న సీఎం రేవంత్ బీసీ కులగణన ప్రక్రియ వల్ల రాబోయే రెండు, మూడు నెలలు జాప్యం కావొచ్చని పేర్కొన్నారు. ఈ ప్రకటనతో సర్పంచ్ పదవికి పోటీ చేయాలనుకున్న ఆశావహులు నిరాశకు గురయ్యారు. ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఆశావహులు గ్రామాల్లో తమ పార్టీలకు మంచి మెజార్టీ వచ్చేలా ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నారు. అలాంటి నేతలతోపాటు ప్రజలకూ సర్పంచ్ ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. గ్రామస్థాయిలోని సమస్యలను ఏ సమయంలోనైనా వార్డు సభ్యులు, సర్పంచులకు చెప్పుకొనే ప్రజలకు ప్రత్యేకాధికారుల దృష్టికి తీసుకెళ్లలేకపోతున్నారు. అధికారులకు తమ శాఖల విధులు, నిధులు లేకపోవడంతో సమస్యలు పరిష్కరించడం ఇబ్బందికరంగా మారింది. 15వ ఫైనాన్స్ నిధులూ రావడం లేదు. ఆస్తి పన్ను వసూళ్లు అంతంతే జరిగాయి. ఈ కారణంగా ప్రత్యేకాధికారులు మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ పనులకు అవసరమైన నిధులు సైతం వెచ్చించే పరిస్థితులు లేవు. పంచాయతీ ఎన్నికలు జరిగితేనే కేంద్రం నుంచి నిధులు విడుదలవుతాయి. ఇదిలా ఉంటే బీసీ రిజర్వేషన్లు 50 శాతం మించొద్దని సుప్రీం కోర్టు ఆదేశాలున్నాయి. ఈ వ్యవహారం కోర్టులో ఉన్నందున పాత రిజర్వేషన్లతో ముందుకెళ్లలేని పరిస్థితులు ఉన్నాయన్నది ప్రభుత్వ అభిప్రాయం. స్థానిక సంస్థల ఎన్నికల్లో గత రెండు పర్యాయాల్లోనూ బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చారు. పాత రిజర్వేషన్లే ఉంటే బీఆర్‌ఎస్‌కు ఆదరణ వస్తుందన్న ఉద్దేశంతో కొత్త రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికల నిర్వహణకు కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో ప్రజాపాలన తీసుకొచ్చామని ఓ వైపు చెప్తూ అదే గ్రామ పంచాయతీల్లో మాత్రం ప్రజలకు దగ్గరగా ఉండే సర్పంచ్ పదవులకు ఎన్నికలు నిర్వహించకపోవడమేంటనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామస్థాయిలో సర్పంచులు, వార్డుసభ్యులే ప్రజలకు దగ్గరగా ఉంటూ ప్రజాపాలకులుగా ఉంటారు. కానీ ఆ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ప్రభుత్వ వైఖరితో ఇప్పుడు మరికొన్ని నెలలు జాప్యమవుతాయని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సర్పంచ్ పదవులకు పోటీపడాలనుకునే నాయకులు, ప్రజల్లో ఆవేదన వ్యక్తమవుతున్నది.

### బీసీ రిజర్వేషన్లపై తేలాల్సి ఉంది..



పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వ ఆదేశంతో ముందుకు వెళ్తాం. ఎన్నికల నిర్వహణకు కోసం ఇప్పటివరకు జిల్లాకు 1800 బ్యాలెట్ బాక్సులు రాగా ఇంకో 1300 బాక్సులు కర్ణాటక నుంచి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. బీసీ రిజర్వేషన్లపై స్పష్టత రావాల్సి ఉన్నది. 15వ ఫైనాన్స్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎస్సీ,ఎస్టీ నిధులు రూ.3కోట్లు వచ్చాయి. ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో పారిశుధ్యం, తాగునీటి నిర్వహణ తదితర పనులు చేపడుతున్నాం.

- కృష్ణ, డీపీవో, నాగర్‌కర్నూల్ జిల్లా



మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీగా గెలుపొందిన నవీన్‌కుమార్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు దేవీప్రసాదరావు, ఎర్రోళ్ల శ్రీనివాస్, అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గెలుపునకు సహకరించిన పార్టీ అధిష్టానం, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.



ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని గురువారం దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నివాసానికి నవీన్ కుమార్‌రెడ్డి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి, తన గెలుపునకు పూర్తి సహకారం అందించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

- మూసాపేట, జూన్ 6

## అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- కలెక్టర్‌కు విన్నవించిన గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ



జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు బండ్ల, విజయుడు, ఎమ్మెల్సీ చల్లా

గద్వాల, జూన్ 6 : గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి జిల్లా అభివృద్ధికి తోడ్పాటునందించాలని కలెక్టర్ సంతోష్‌ను గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి విన్నవించారు. గురువారం వారు కలెక్టర్‌ను కలిసి గద్వాల,అలంపూర్ నియోజకవర్గాల్లో జరుగుతున్న, నిలిచిపోయిన అభివృద్ధి పనులపై చర్చించారు. త్వరలో పాఠశాలలు ప్రారంభం అవుతున్నందున విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు పుస్తకాలు, దుస్తులు అందించాలని కోరారు. వర్షాకాలం ప్రారంభమవుతున్నందున గ్రామీణ ప్రాంతాల్లో కొన్నింటికి సరైన రోడ్డు సౌకర్యం కూడా లేదని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలన్నారు. గ్రామాల్లో సర్పంచులు లేనందువల్ల ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుందని, పారిశుధ్య పనులు చేపట్టి ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో గద్వాల నియోజకవర్గంలో చేపట్టిన వివిధ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలు పూర్తయ్యే విధంగా ప్రత్యేక నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేసి వినియోగంలోకి వచ్చేలా చూడాలన్నారు.

అందుకు కలెక్టర్ స్పందిస్తూ ఎక్కడెక్కడ అభివృద్ధి పనులు నిలిచిపోయాయో గుర్తించి ప్రాధాన్యత క్రమంలో వాటిని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవడంతోపాటు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు.



మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పీర్లగుట్ట డబుల్‌బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు

## 'డబుల్' ఇండ్ల సమస్యలు పరిష్కరించాలి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, జూన్ 6 : పీర్ల గుట్టతోపాటు పలు చోట్ల కట్టించిన డబుల్ బెడ్రూం సమస్యలను అధికారులు పరిష్కరించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పీర్లగుట్ట వద్ద ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్ల కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా చొరవ చూపాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి ప్రజలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు గూడు కల్పించాలన్న ఆలోచనతో వారి కోసం డబుల్ బెడ్రూం ఇండ్లను కట్టించినట్లు గుర్తు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో తాము ప్రజలకు అందించిన డబుల్ బెడ్రూం కాలనీల్లో పూర్తి స్థాయిలో వసతుల కల్పన చేపట్టలేక పోయామని, కలెక్టర్, మున్సిపల్ అధికారులు కల్పించుకొని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ముఖ్యంగా విద్యుత్, రోడ్డు, వీధి దీపాలు, తాగునీటి సరఫరాతోపాటు సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు. మాజీ మంత్రిని కలిసిన వారిలో కాలనీవాసులు నాగమ్మ, సుజాత, అరుణ, షానవాజ్, రమేశ్ తదితరులు ఉన్నారు.



పతకాలు సాధించిన క్రీడాకారులు

## రాష్ట్ర స్థాయిలో క్రీడాకారుల సత్తా

నారాయణపేట టౌన్, జూన్ 6 : వరంగల్ జిల్లా హన్మకొండలో జరుగుతున్న 10వ తెలంగాణ సీనియర్స్, కిడ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పేట జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటి 12 పతకాలు సాధించారు. అండర్-8 విభాగం 150 మీటర్ల పరుగుపందెంలో మహేశ్ సిల్వర్ మెడల్, 50 మీటర్ల పరుగుపందెంలో వరుణ్ సిల్వర్ మెడల్ సాధించారు. అండర్-10 విభాగం లాంగ్ జంప్‌లో భరత్ గోల్డ్‌మెడల్, లాంగ్‌జంప్‌లో మౌలాలి సిల్వర్ మెడల్ సాధించగా లాంగ్ జంప్‌లో పార్వతి బ్రాంజ్ మెడల్‌తోపాటు 50 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించింది. అండర్-12 విభాగం లాంగ్‌జంప్‌లో విష్ణు బ్రాంజ్ మెడల్ సాధించగా, అండర్-14 విభాగం 400 మీటర్ల పరుగుపందెంలో బసంత్ గోల్డ్ మెడల్ సాధించాడు. అండర్-20 విభాగం 100 మీటర్ల పరుగుపందెంలో అరవింద్ సిల్వర్ మెడల్ సాధించారు. మెన్స్ విభాగం హైజంప్‌లో జనార్దన్ గోల్డ్ మెడల్‌తోపాటు 110 మీటర్ల హడిల్స్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. పతకాలు సాధించిన క్రీడాకారులను తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ సారంగపాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, కోచ్‌లు జగదీశ్, శ్రీలత, రాజు అభినందించారు.

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో భారీ వర్షం
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- నెలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- వాహనదారుల ఇబ్బందులు
- పెద్దాపూర్‌లో పిడుగు పాటుకు మహిళ మృతి
- మరొకరికి తీవ్రగాయాలు
- తీగల్‌పల్లిలో గేదె మృతి



మహబూబ్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌పై నిలిచిన వర్షపు నీటిలో వెళ్తున్న వాహనదారులు

## తడిసి ముద్దయిన పాలమూరు



అలంపూర్ ప్రభుత్వ కళాశాల వెనుక భాగంలో భారీగా నిలిచిన వర్షపు నీరు



మహబూబ్‌నగర్ క్లాక్‌టవర్ వద్ద కురుస్తున్న వర్షం



నాగర్‌కర్నూల్‌లో నేలమట్టమైన సైన్స్ డిగ్రీ కళాశాల ప్రహరీ



అలంపూర్ అక్బర్‌పేట కాలనీలో ఇంటిలోకి చేరిన వర్షపు నీరు

మహబూబ్‌నగర్ అర్బన్/నాగర్‌కర్నూల్/అలంపూర్/వెల్దండ/నవాబ్‌పేట, జూన్ 6 : మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో గురువారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో భారీవర్షం కురిసింది. వర్షపు నీటితో గడియారం చౌరస్తా, రాంమందిర్ చౌరస్తా, పద్మావతి కాలనీ, వన్‌టౌన్, పాతపాలమూరు, శివశక్తినగర్ ప్రాంతాల ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా జిల్లాలోని మహ్మదాబాద్‌లో 11.8 మి.మీ. వర్షం కురవగా.. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షపాతం నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో నిలిచిన వర్షపు నీటితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పునాది లేకుండా నిర్మించిన డిగ్రీ కళాశాల ప్రహరీ వర్షానికి నేలమట్టమైంది. నిర్మాణం చేపట్టిన సంవత్సరానికి చిన్నపాటి వర్షానికే కూలిపోయింది. అలంపూర్‌లో గత రాత్రి కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ ఎదుట, వెనుక భాగం పూర్తిగా వర్షపు నీటితో నిండిపోయింది. కళాశాలలోకి వెళ్లేందుకు కూడా వీలు లేకుండా పోయింది. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కూడా వర్షపు నీరు నిలిచింది. అక్బర్‌పేట కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షపు నీరు ఇండ్లల్లోకి చేరుతున్నది. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని పలుమార్లు మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అయితే గురువారం తెల్లవారు జామున సుమారు 68.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్టు అధికారులు పేర్కొన్నారు. వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామంలో గురువారం మధ్యాహ్నం పిడుగుపాటుకు బేగారి జంగమ్మ (40) అక్కడికక్కడే మృతి చెందగా.., ఆమె భర్త కృష్ణయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. భార్యాభర్తలు పొలంలో పత్తి, జొన్న విత్తనాలు వేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకున్నది.

అదే విధంగా మండలంలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులకు రాచూర్, పెద్దాపూర్ తదితర గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. నవాబ్‌పేట మండలంలో సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి వాగులు, వంకల్లో వరద నీరు పారింది. తీగల్‌పల్లి గ్రామంలో చెట్టుపై పిడుగు పడగా ఇందిరమ్మకు చెందిన గేదె మృతి చెందింది. గేదె విలువ సుమారుగా రూ.లక్ష ఉంటుందని ఇందిరమ్మ తెలిపారు.



కుంటను తలపిస్తున్న నాగర్‌కర్నూల్ జూనియర్ కళాశాల ఆవరణ



జోగుళాంబ ఆలయ సమీపంలోని పంప్‌హౌస్ వద్ద నిలిచిన వర్షపు నీరు





ఉండవెల్లి : భైరాపురంలో ఇండ్ల మధ్య నిలిచిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న ఎంపీవో, అలంపూర్ ప్రభుత్వ కళాశాల వద్ద నిలిచిన వర్షపు నీరు



పిడుగుపాటుకు గురై మృతి చెందిన జంగమ్మ (ఫైల్)



లింగాల : ధారారం శివారులో పారుతున్న వాగు